

చీనీ టన్ను రూ.18,500
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.18,500 పలికాయి.



టమాట కిలో రూ.12
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.12 కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.5°/17.2°
జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఈవీఎంల భద్రత కోసం 'బిట్' పరిశీలన



బిట్‌లో తరగతి గదులను పరిశీలిస్తూ వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ అరుణ్‌బాబు

హిందూపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో ఉపయోగించే ఈవీఎంల భద్రత కోసం మండల పరిధిలోని 'బిట్' ఇంజినీరింగ్ కళాశాలను కలెక్టర్ అరుణ్‌బాబు పరిశీలించారు. బుధవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌తో కలిసి కళాశాలకు వచ్చిన ఆయన.. కళాశాలలోని తరగతి గదులను పరిశీలించారు. ఇక్కడ హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాలకు సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను భద్రపరిచేందుకు, అవసరమైతే కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. కళాశాలలోని గదులు, సౌకర్యాలపై ప్రిన్సిపాల్‌ను ఆరా తీశారు. కౌంటింగ్ కేంద్రంగా 'బిట్' అనువుగా ఉంటుందా అన్న అంశంపై అధికారులతో చర్చించారు.

వందశాతం ఓటింగ్‌కు కృషి చేస్తాం



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో వందశాతం ఓటింగ్ నమోదయ్యేలా కృషి చేస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన.. జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్‌ఓ కొండయ్య తదితరులతో కలిసి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. అవసరమైన చోట మొబైల్ టాయిలెట్లు కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. జిల్లాలో 1,561 పోలింగ్ కేంద్రాలు, 176 రూట్లు ఉన్నాయన్నారు.

ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం
80 ఏళ్లు పైబడిన వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్నవారు, 40 శాతం పైబడి వైకల్యం ఉన్న దివ్యాంగ ఓటర్లు ఫారం–12డీ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని కలెక్టర్ తెలిపారు. ఈసీ నిబంధనల మేరకు కదిరి రూరల్‌లోని కుటాగుళ్ల, అర్బన్ పరిధి, ధర్మవరం పరిధిలోని ఆరు పోలింగ్ కేంద్రాల్లో మార్పులు, చేర్పులు చేశామన్నారు. మార్చి 2వ తేదీన మరోసారి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామన్నారు.

జిల్లాలో రెండు కౌంటింగ్ కేంద్రాలు..
జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు రెండు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. లేపాక్షిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. అలాగే గోరంట్లలోని మాంటిస్సోరి పాఠశాల కేంద్రంలో పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజక వర్గాల ఓట్లు లెక్కింపు ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలను రాజకీయ పార్టీల నేతలు పరిశీలించి అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, వెంకటశివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు ఆర్థిక చేయూత

- 'వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్' నిధుల విడుదల
- జిల్లాలోని 2,79,556 మంది రైతుల ఖాతాల్లోకి రూ.55.94 కోట్లు
- సున్నా వడ్డీ కింద 1,08,260 మందికి రూ.17.81 కోట్ల లబ్ధి
- రైతులకు మెగా చెక్కులు అందజేసిన కలెక్టర్ అరుణ్‌బాబు



రైతులకు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ అభిషేక్ కుమార్ తదితరులు

పుట్టపర్తి అర్బన్: రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. రైతు వేసే ప్రతి అడుగులోనూ సీఎం వైఎస్ జగన్ తోడుగా నిలుస్తున్నారన్నారు. ఈక్రమంలో వరుసగా ఐదో ఏడాదీ 'వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్' నిధులు విడుదల చేశారన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ కంప్యూటర్‌లో బటన్ నొక్కి వైఎస్సార్ రైతు భరోసా నిధులను అర్హులైన రైతుల ఖాతాల్లో జమ చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, పట్టు పరిశ్రమ శాఖ అధికారి పద్మమ్మ, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు జిల్లాలోని వైఎస్సార్ రైతు భరోసా లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు.

అర్హతే ఆధారంగా పథకాల అమలు..
అర్హతే ఆధారంగా పథకాలు అందిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. 'వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్' పథకం కింద జిల్లాలో 2,79,580 మంది రైతుల ఖాతాల్లో రూ.55.94 కోట్లు జమ అయ్యాయన్నారు. ఇందులో భూమి ఉన్న రైతులు 2,78,898 మంది, కౌలు రైతులు 665 మంది, దేవదాయ, అటవీ శాఖకు చెందిన భూములను సాగు చేసే రైతులు 17 మంది ఉన్నారన్నారు. అలాగే రూ.లక్షలోపు బ్యాంకుల నుంచి రుణం పొందిన రైతులు 1,08,260 మంది ఉండగా, సున్నా వడ్డీ కింద వారి ఖాతాల్లో రూ.17,81 కోట్లు జమ అయ్యాయన్నారు. రైతులకు ఏటా మూడు విడతల్లో 'వైఎస్సార్ రైతు భరోసా' పథకం ద్వారా రూ.13,500 చొప్పున అందుతోందన్నారు. ఐదేళ్లలో ఒక్కో రైతుకు రూ.67,500 అందిందన్నారు. ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి రైతూ పంటలు సాగు చేయాలన్నారు.

ఐదేళ్లలో జిల్లా రైతులకు అందించిన వైఎస్సార్ రైతు భరోసా మొత్తం

సంవత్సరం	రైతులు	అందజేసిన మొత్తం (రూ.కోట్లలో)
2019-20	2,56,170	348.07
2020-21	2,78,337	358.04
2021-22	2,70,443	361.26
2022-23	2,68,947	363.12
2023-24	2,79,556	321.48
మొత్తం	13,53,453	1,752

ఏటా సున్నా వడ్డీ అందుతోంది



బ్యాంకులో రూ.లక్షలోపు రుణం తీసుకుంటున్న నాకు ఏటా సున్నా వడ్డీ ద్వారా లబ్ధి కలుగుతోంది. అలాగే ఐదేళ్లుగా పంటలు సాగు చేసే సమయంలో పెట్టుబడికి ఇబ్బంది లేకుండా వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఆర్థిక సహాయం అందుతోంది. గతంలో పంటల సాగుకు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేయాల్సి వచ్చేది. రైతుకు మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.
– నరసింహులు, రైతు, కనుముక్కల, సీకేపల్లి మండలం

మాకు కొండంత ధైర్యం



గతంలో చాలా ప్రభుత్వాలను చూశాం. కానీ ఇప్పుడున్నది రైతు సంక్షేమ ప్రభుత్వం . అవినీతికి తావు లేదు. ఎవరి సిఫారసు అవసరం లేదు. అర్హత ఉంటే చాలు పథకాలన్నీ ఇంటికే నడిచి వస్తున్నాయి. నాకు రైతు భరోసాతో పాటు ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ అందుతోంది. ఇలాంటి ముఖ్యమంత్రి ఉంటే మా లాంటి నిరుపేద రైతులకు కొండ ధైర్యం ఉంటుంది.
– ఉమాదేవి, రైతు, వానవోలు, గోరంట్ల మండలం

వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం



వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురిసి రైతులంతా సంతోషంగా ఉన్నారు. దీనికితోడు విత్తన పంపిణీ మొదలు పంట విక్రయం దాకా జగన్ రైతుల వెన్నంటే ఉన్నారు. అందుకే మేము ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుల కోసమే ఏకంగా 22 పథకాలు అమలు చేస్తున్నారు.
– నాగశంకరరెడ్డి, కర్ణాటక నాగేపల్లి, పుట్టపర్తి మండలం

కోడ్ అమలులో పోలీస్ పాత్ర కీలకం

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ విధి విధానాలపై పోలీసు శాఖలోని ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే పక్కాగా అమలు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉండే పోలీసులు పాటించాల్సిన విధివిధానాలు, ఈసీ నిబంధనలపై బుధవారం పుట్టపర్తిలోని సాయిఆరామంలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు పోలీసుల పాత్ర కీలకమన్నారు. ఎన్నికల కోడ్ ప్రవర్తనా నియమావళి విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ఓటరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకొనేలా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉంటుందన్నారు. ఈసీ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ డివిజన్ల డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు

ఎస్సీ యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు

పుట్టపర్తి: ఎస్సీ యువతకు సర్వేయర్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చైర్మన్‌గా ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (నాక్), నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగి 10వ తరగతి, ఆపై తరగతులు చదివిన వారు అర్హులన్నారు. శిక్షణ సమయంలో వసతి, భోజన సౌకర్యం కూడా ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు సైతం కల్పిస్తామన్నారు. వివరాలకు 9110550779, 9052901657 నంబర్లలో సంప్రదించాలని సూచించార

కక్షలకు ఆజ్యం.. పరిటాల నైజం

మళ్లీ 'పరిటాల' అరాచకం!
- ఫ్యాక్షన్ రాజకీయాలకు ఆజ్యం పోస్తున్న అనుచరులు
- గుడి కట్టినా, బడి కట్టినా పగలగొడతామన్న ఆడియో వైరల్
- పరిటాల కుటుంబానికి అవకాశమిస్తే మళ్లీ పాత రోజులే!



రాప్తాడు రూరల్: ఒకప్పుడు ఫ్యాక్షన్ రాజకీయాలతో వణికిన రాప్తాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాకతో ప్రశాంత వాతావరణం నెలకొంది. తాజాగా టీడీపీ నేతల వ్యాఖ్యలు మళ్లీ ఫ్యాక్షన్ గొడవలకు ఆజ్యం పోస్తాయేమోనని రాప్తాడు నియోజకవర్గ ప్రజల్లో ఆందోళన నెలకొంది. పరిటాల అండ చూసుకుని కొందరు టీడీపీ నాయకులు చేస్తున్న ఈ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఆత్మకూరు మండలం వడ్డుపల్లిలోని ప్రభుత్వ స్థలంలో యాదవుల ఆరాధ్యదైవం శ్రీకృష్ణ దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భూమి పూజ చేశారు. బీసీలకు అండగా నిలుస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని చూసి టీడీపీ నాయకులు ఓర్వలేక ఫ్యాక్షన్ తరహా రాజకీయాలకు తెరలేపుతున్నారు. ఆత్మకూరు మండల టీడీపీ మాజీ కన్వీనర్ కృష్ణమోహన్‌చౌదరి ఓ యువకుడితో ఫోన్లో మాట్లాడిన అంశాలు చర్చనీయాంశంగా మారాయి. వడ్డుపల్లిలో తమను కాదని శ్రీకృష్ణ ఆలయం ఎలా నిర్మిస్తారో చూస్తామని ఆయన బెదిరించారు. 'ఈ విషయం ఇప్పటికే పరిటాల సునీత ఎస్పైకు కూడా చెప్పింది. గుడి కట్టినా, బడి కట్టినా మన టైం రాగానే అన్నీ పగలకొడతాం' అంటూ కృష్ణమోహన్ చౌదరి మాట్లాడటం కలకలం రేపింది. గ్రామాల్లో టీడీపీ నేతల ఇలాంటి వ్యాఖ్యలు ఫ్యాక్షన్ తరహా మనస్తత్వాలకు అద్దం పడుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పరిటాల రక్తదాహానికి ఎందరో బలి
గతంలో రాప్తాడు నియోజకవర్గం పేరు చెప్పగానే ఫ్యాక్షన్ రాజకీయాలే గుర్తుకొచ్చేవి. ఆ భూతానికి ఎన్నో కుటుంబాలు సమిధలుగా మారాయి. టీడీపీ నేత పరిటాల రవీంద్ర హయాంలో ఈ నరమేధానికి అంతేలేదు. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక సామాజిక వర్గం లక్ష్యంగా ఊచకోత జరిగిందని నేటికీ చెబుతారు. అప్పట్లో మాయమైన కొందరి ఆనవాళ్లు ఇప్పటికీ దొరకలేదు. పరిటాల సునీత మంత్రిగా, ఎమ్మెల్యేగా పని చేసిన సమయంలోనూ ఈ ప్రాంతంలో నిత్యం దౌర్జన్యాలు, దాడులు, బెదిరింపులతో రౌడీ రాజ్యం సాగిందనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉంది. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నియోజకవర్గంలో ఫ్యాక్షన్ ఆనవాళ్లు లేకుండా చేశారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన రెండోరోజే బహిరంగ లేఖ రాశారు. ఎక్కడైనా టీడీపీ వాళ్లు కవ్వింపు చర్యలకు దిగినా సంయమనం పాటించాలని.. ప్రతి చర్యలకు పాల్పడొద్దని శ్రేణులను కోరారు. ఎవరైనా గొడవలు, దౌర్జన్యాలు చేస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని పేర్కొన్నారు. దీంతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంది.

పరిటాల కుటుంబం వస్తే మళ్లీ పాత రోజులే!
ప్రశాంతంగా ఉన్న రాప్తాడు నియోజకవర్గంలో పరిటాల కుటుంబం మళ్లీ ఫ్యాక్షన్ గొడవలకు ఆజ్యం పోస్తోందనే విమర్శలు వస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో పరిటాల సునీత సొంత గ్రామం వెంకటాపురంలో టీడీపీ కార్యకర్తలతో పరిటాల శ్రీరామ్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. 'మీరంతా ఒకటి గుర్తు పెట్టుకోండి. మన ప్రభుత్వంలో వైఎస్ విగ్రహాన్ని పగలకొట్టి మెడకు తాడేసి అక్కడి దాకా ఈడ్చుకుంటూ పోయాం. దానికి వాళ్లు ఏమై ఉంటారో ఆలోచించండి. మన ప్రభుత్వం రాగానే మళ్లీ అదే జరుగుతుంది' అంటూ శ్రీరామ్ రెచ్చగొట్టేలా మాట్లాడారు. ఇలాంటి వ్యాఖ్యలతో ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారు. పరిటాల కుటుంబానికి మళ్లీ అవకాశం ఇస్తే పాత రోజులు వస్తాయనే చర్చ ప్రజల్లో సాగుతోంది.

దిగజారుడు రాజకీయాలు మానుకో

- సవితకు మంత్రి ఉషశ్రీచరణ్ హితవు
- ఈత చెట్లు ధ్వంసం చేసింది మీ అనుచరులే
- బుద్ధిగా ఉండకపోతే గుణపాఠం చెబుతామని హెచ్చరిక



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

రొద్దం: ''టీడీపీ హయాంలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకునేందుకు ఏమీ లేదు. గ్రామాలకు వెళ్తే జనం ఆదరించడం లేదు. అందుకే నాపై నిందలు వేస్తూ చిల్లర రాజకీయం చేయాలనుకున్నావు. ప్రజల నుంచి నాకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే దిగజారి ప్రవర్తిస్తున్నావు...ఇకనైనా బుద్ధి తెచ్చుకో...లేకపోతే గుణపాఠం చెబుతాం'' అని మంత్రి ఉషశ్రీచరణ్ పెనుకొండ టీడీపీ అభ్యర్థి సవితను హెచ్చరించారు. బుధవారం మంత్రి ఉషశ్రీ చరణ్ రొద్దం మండలం నారనాగేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని కంచిసముద్రం గ్రామానికి చెందిన రైతులు చెరువు పోరంబోకులో ఈత చెట్లు తొలగిస్తే వారిపై ఈనెల 2వ తేదీన ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేశారన్నారు. ఈ ఘటనను తనకు ఆపాదిస్తూ తన అనుచరులు ఈత చెట్లను ధ్వంసం చేసినట్లు, గీతకార్మికులు రోడ్డున పడినట్లు సవిత రాజకీయానికి తెరతీశారన్నారు. సవిత అనుచరుడు, టీడీపీ నాయకుడే ఈత చెట్లను ధ్వంసం చేసినట్లు గ్రామస్తులే చెబుతున్నారన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ.. వాటిని ఎల్లో మీడియా ద్వారా ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకోవాలని టీడీపీ నేతలు చూస్తున్నారని, కానీ విజ్ఞులైన జనం వారిని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఈడిగ సామాజిక వర్గాన్ని, గీత కార్మికులను గుర్తించి వారి సంక్షేమం కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. అందువల్లే ఆయా వర్గాలన్నీ ఇప్పుడు వైఎస్సార్ సీపీ వెంట నడుస్తున్నాయన్నారు. దీన్ని ఓర్వలేకే టీడీపీ నేతలు లేనిపోని ఆరోపణలు చేస్తూ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని మంత్రి ఉషశ్రీ చరణ్ మండిపడ్డారు. సమావేశంలో స్థానిక సర్పంచ్ నాగార్జున, జెడ్పీటీసీ పద్మావతి, ఎంపీపీ చంద్రశేఖర్, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నేతలు తొలగించిన ఈత చెట్లను చూపుతున్న గ్రామ రైతులు

ఈతచెట్ల తొలగింపుతో మంత్రికి సంబంధం లేదు..
తమ గ్రామంలో చెరువు వద్ద ఉన్న ఈత చెట్ల తొలగింపు ఘటనతో మంత్రి ఉషశ్రీచరణ్‌కు ఎటువంటి సంబంధమూ లేదని సర్పంచ్ గంగాధర్, రైతులు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈత చెట్లను టీడీపీ నాయకుడే తొలగించి ఆ నెపాన్ని వైఎస్సార్ సీపీ నేతలపై, మంత్రిపై నెట్టడానికి ప్రయత్నించారన్నారు. కార్యక్రమంలో రైతులు మద్దిలేటి, చిన్న, తాడప్ప పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ప్రచార యావ

- శింగనమల టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణి ప్రచార యావకు యువకుడి దుర్మరణం, మరో వ్యక్తికి గాయాలు
- ఆమె ఇంటి వద్ద ఫ్లెక్సీలు కట్టే క్రమంలో విద్యుదాఘాతంతో మృతి
- ఆరోగ్యం బాగో లేదంటున్నా బలవంతంగా కూలీలను తీసుకెళ్లిన వైనం
- ఇంటి పెద్ద దిక్కు మృతితో దిక్కులేని వారైన భార్య, నలుగురు పిల్లలు



బండారు శ్రావణి ఇంటి వద్ద ఫ్లెక్సీలు కడుతూ విద్యుత్ షాక్‌కు గురైన సలీమ్, సాకే రాజు



మృతి చెందిన సాకే రాజు

అనంతపురం: శింగనమల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణి ప్రచార యావ ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. ఇంటి పెద్ద దిక్కు మృతితో భార్య, నలుగురు పిల్లలు దిక్కులేని వారయ్యారు. తన ఇంటి వద్దకు పని నిమిత్తం వచ్చిన ఓ అభాగ్యుడు చనిపోతే, కనీసం అతడి కుటుంబ సభ్యులను శ్రావణి పరామర్శించకపోవడం విమర్శలకు తావిచ్చింది. వివరాలు.. శింగనమల నియోజకవర్గ టీడీపీ టికెట్‌ను బండారు శ్రావణి శ్రీ దక్కించుకున్నారు. దీంతో అనంతపురం అరవింద నగర్‌లోని ఆమె ఇంటి వద్ద భారీ కటౌట్‌లు, ఫ్లెక్సీలు కట్టాలని నిర్ణయించారు. బండారు శ్రావణి అనుచరులు రాజు, మేదర కాకర్ల దుర్గన్నకు పని అప్పగించారు. వీరు తమతో పాటు పని చేసేందుకు దినసరి కూలీ సాకే రాజు(40)ను పిలిచారు. 'నాకు ఆరోగ్యం బాగోలేదు. రాలేను, పైగా శ్రావణి ఇంటి పైనే 11 కేవీ లైన్ వెళ్తుంది. అక్కడ కటౌట్‌లు కడితే ప్రమాదం' అని రాజు చెప్పినా వినకుండా ఎలాగైనా రావాలి అంటూ పురమాయించారు. ఈ క్రమంలోనే సాకే రాజు బుధవారం శ్రావణి ఇంటి వద్దకు వచ్చి పొడవాటి కట్టెలు నాటాడు. కటౌట్ కట్టేందుకు శ్రావణి ఇంటి పైకి వెళ్లాడు. ఈ క్రమంలోనే 11 కేవీ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో సలీం అనే వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. సాకే రాజు మృతి చెందాక కనీసం అతని కుటుంబీకులకు సైతం తెలియజేయలేదు. శ్రావణి ఇంటి వద్ద ఉన్న నాయకులు నేరుగా సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. మార్చురీ వద్ద రాజుకు తెలిసిన వ్యక్తి చూసి ఆయన భార్యకు సమాచారం ఇచ్చారు. దీంతో రాజు భార్య లక్ష్మీదేవి తన నలుగురు పిల్లలతో హుటాహుటీన ఆస్పత్రికి చేరుకున్నారు. విగతజీవిగా పడి ఉన్న రాజును చూసి గుండెలవిసేలా రోదించారు. ఇక తమకు దిక్కెవరయ్యా అంటూ ఆమె రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. వారిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు.

కఠినంగా శిక్షించాలి..
తన భర్త ముందే హెచ్చరించినా, పనికి తీసుకెళ్లి ఆయన ప్రాణాలు తీశారని మృతుడు భార్య సాకే లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. బండారు శ్రావణి, ఆమె అనుచరులు రాజు, మేదర కాకర్ల దుర్గన్నలు తన భర్త మృతికి బాధ్యత వహించాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని అనంతపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, సాకే రాజుకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రమాదం అని తెలిసినా..
తన ఇంటిపై భారీ విద్యుత్ లైను వెళ్తుందని తెలిసినా బండారు శ్రావణి నిర్లక్ష్యంగా వ్యవహరించి ఓ వ్యక్తి మృతికి కారణమయ్యారని పలువురు విమర్శించారు. కనీసం మృతుడి కుటుంబ సభ్యులను బండారు శ్రావణి పలకరించకపోవడాన్ని తప్పుబడుతున్నారు. పోలీసులు కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పలువరు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ సాధనే ధ్యేయం



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

గుత్తి: ఎస్సీ వర్గీకరణ సాధనే ధ్యేయమని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. గుత్తిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ హాజరై, మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్న ప్రస్తుత తరుణంలో ఎస్సీ వర్గీకరణకు ప్రతి మాదిగ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సునీత, వీరన్న, నగదాని సత్య తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖలో బదిలీలకు పచ్చజెండా

అనంతపురం సిటీ: తపాలా ఉద్యోగుల బదిలీలకు ఆ శాఖ ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేశారు. మార్చి 1 నుంచి బదిలీలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆ రోజు నుంచి 22వ తేదీ వరకూ తమ పైస్థాయి అధికారులకు ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. సీనియారిటీ మేరకు ఏప్రిల్ 12న బదిలీల జాబితా రూపొందిస్తారు. అదే నెల 30న బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తారు. జూన్ 30న బదిలీ స్థానాల్లో ఉద్యోగులు చేరాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ఉద్యోగుల మొదలు అదనపు సూపరింటెండెంట్ల వరకూ బదిలీలకు అర్హులు. ఈ మేరకు తపాలా శాఖ ఉత్తర్వులు వెలువరించింది.

ఇదెక్కడి రు'బాబు'!

- టీడీపీ కార్యకర్త బాబుగౌడ దౌర్జన్యం
- ట్రీ పట్టా పేరుతో ఒకటిన్నర ఎకరా కబ్జా
- డ్వామా నర్సరీలో బోరుబావి తవ్వకం
- నీళ్లు పడకపోవడంతో అలాగే వదిలేసిన వైనం

సాక్షి, పుట్టపర్తి: ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ అండతో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రెచ్చిపోయాడు. నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)కు చెందిన ఒకటిన్నర ఎకరా భూమిని కబ్జా చేశాడు. అధికారులు పట్టించుకోకపోవడంతో తాజాగా ఆ స్థలంలో బోరు తవ్వించాడు. నీరు పడకపోవడంతో దానిని అలాగే వదిలేశాడు.

ట్రీ పట్టాను అడ్డు పెట్టుకుని...

పుట్టపర్తి శివారున శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వెనుక ఉన్న బీడుపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 16/1లో 5.35 ఎకరాల్లో డ్వామా నర్సరీ ఉంది. కొన్నేళ్లుగా ఈ నర్సరీ డ్వామా అధ్వర్యంలోనే నడుస్తోంది. ఇందులో ఒకటిన్నర ఎకరాకు 2006లో పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లికి చెందిన ఈడిగ రామచంద్రప్పకు అప్పటి రెవెన్యూ అధికారులు ట్రీ పట్టా ఇచ్చారు. వాస్తవానికి ఏటా ట్రీ పట్టా రెన్యూవల్ చేసుకోవాల్సి ఉన్నా... ఇప్పటివరకూ రామచంద్రప్ప రెన్యూవల్ చేసుకోలేదు. ఇటీవల ఆయన మరణించాడు. దీంతో ట్రీ పట్టా కారణంగా పొందిన ఆ భూమి తనదేనంటూ కొందరు టీడీపీ నాయకుల అండతో రామచంద్రప్ప తనయుడు బాబు గౌడ కబ్జా చేశాడు. అంతటి ఆగకుండా పొలం చుట్టూ కంచె వేశాడు.

అనుమతుల్లేకున్నా బోరు తవ్వకం..

బాబు గౌడ భూ ఆక్రమణపై డ్వామా అధికారులు ఆర్నెళ్ల క్రితమే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలోనే బాబుగౌడ తాను ఆక్రమించిన ఒకటిన్నర ఎకరాలో కొబ్బరి మొక్కలు నాటించాడు. ఇటీవల రాత్రికి రాత్రే బోరు బావి కూడా తవ్వించాడు. అయితే బోరుబావి తవ్వకానికి ఎలాంటి అనుమతులు లేవు. నీళ్ల పడకపోవడంతో ఆ బోరు బావిని అలాగే వదిలేశాడు. ఆక్రమిత ఒకటిన్నర ఎకరంలో ఓ ఈత చెట్టు ఉండగా.. ఆ చెట్టు ఆధారంగా కల్లు దుకాణానికి అనుమతి సైతం తెచ్చుకున్నాడు. ఈ మొత్తం అక్రమాలకు బాబుగౌడకు ఎక్సైజ్ శాఖలోని ఓ ఎస్ఐ, రెవెన్యూ శాఖలోని ఓ డిప్యూటీ తహసీల్దార్ బాగా సహకరించినట్లు తెలుస్తోంది.



బాబుగౌడ నాటించిన కొబ్బరిచెట్లు



డ్వామా నర్సరీలో ఆక్రమణకు గురైన ఒకటిన్నర ఎకరా భూమి ఇదే

భూమి విలువ పెరగడంతోనే..

నూతనంగా శ్రీసత్యసాయి జిల్లా ఏర్పడటంతో పుట్టపర్తి చుట్టుపక్కల భూముల విలువ భారీగా పెరిగింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సమీపంలో ఎకరం రూ.కోటికి పైగానే ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలో బాబుగౌడ డ్వామా నర్సరీ వీడకుండా.. తనకు హక్కులు ఉన్నాయని దౌర్జన్యానికి దిగుతున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ శాఖలో పని చేస్తున్న ఒకరిద్దరు ఉద్యోగుల సలహాలు, సూచనలతో డ్వామా నర్సరీపై బాబుగౌడ కన్నేసినట్లు చెబుతున్నారు.

ట్రీ పట్టా అంటే..

బతుకుదెరువు కోసం ఏడాది గడువుతో ట్రీ పట్టా ఇస్తారు. తదుపరి ఏడాది రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తమయినా ట్రీ పట్టా రద్దు చేసే అధికారం కలెక్టర్‌కు ఉంటుంది. ట్రీ పట్టా ఉన్నప్పటికీ.. ఆ స్థలంపై ఎలాంటి హక్కు ఉండదు. కేవలం అందులో ఉన్న చెట్ల ఫలసాయాన్ని పొందే హక్కు మాత్రమే ఉంటుంది.

ఫిర్యాదు చేశాం

సర్వే నంబరు 16/1లో 5.35 ఎకరాల్లో డ్వామా నర్సరీ ఉంది. అందులో ఒకటిన్నర ఎకరా బాబుగౌడ ఆక్రమించింది వాస్తవం. దీనిపై రెవెన్యూ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాం. అంతేకాక ఇటీవల ఆ సర్వే నంబరు ఆధారంగా పరిశీలిస్తే.. ఆ భూమి నిషేధిత జాబితాలో చేర్చినట్లు తెలిసింది.

– విజయప్రసాద్, పీడీ, డ్వామా

ప్రమాదంలో బాలుడి మృతి

చిలమత్తూరు: మండలంలోని మరువకొత్తపల్లి బీసీ కాలనీ వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. వివాహ శుభకార్యానికి హాజరయ్యేందుకు తన మనవడు జగదీష్ (14)తో కలసి బయలుదేరిన ఆదినారాయణప్ప ద్విచక్ర వాహనాన్ని మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో ఆదినారాయణప్ప మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన జగదీష్ పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబసభ్యులు బెంగళూరులోని ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక బాలుడు బుధవారం ఉదయం మృతి చెందాడు. ఒకే కుటుంబంలో ఇద్దరి మృతితో మృతుల ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, మరువకొత్తపల్లి వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలంటూ గ్రామస్తులు రాస్తారోకో చేపట్టారు.

మెగా జాబ్‌మేళా విజయవంతం



మాట్లాడుతున్న హరీష్‌కుమార్ యాదవ్



జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులు

- వెయ్యి మంది నిరుద్యోగులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు

అనంతపురం ఎడ్యుకేషన్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా హరీస్‌కుమార్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. అనంతపురంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 3,500 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఐటీ, బీపీఓ, ఫార్మా, బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, మ్యానుఫ్యాక్చరింగ్ తదితర రంగాలకు చెందిన దాదాపు 70 కంపెనీల ప్రతినిధులు హాజరై ఆయా కంపెనీలకు అవసరమైన మానవ వనరులను ఎంపిక చేశారు. వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు దక్కాయి. వీరిలో 350 మందికి యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీశ్ కుమార్ యాదవ్ చేతుల మీదుగా ఆఫర్ లెటర్లు అందజేశారు. మిగిలిన వారికి రెండు, మూడు రోజుల్లో నియామక పత్రాలను కంపెనీ నిర్వాహకులు అందజేయనున్నారు. ఈ సందర్భంగా హరీష్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో తాను గతంలో ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. తన ఫౌండేషన్ ద్వారా ఇంత మందికి ఉద్యోగ అవకాశాలు దక్కడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఇవాళ ఉద్యోగం రానివారు నిరుత్సాహపడకుండా మరో ప్రయత్నానికి సిద్ధం కావాలన్నారు. వారికి ముమ్ముందు మరింత ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతం ఎంపికైన అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కళాశాల యాజమాన్యం, అపిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించగా టెక్ మహీంద్ర కంపెనీకి 78 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆ కళాశాల చైర్మన్ సి.సోమశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మధుసూదన్‌రెడ్డి, అపిత ఫౌండేషన్ డైరెక్టర్ రాజగోపాల్ తెలిపారు. వచ్చిన ప్రతీ కంపెనీ ప్రతినిధికి హరీష్‌కుమార్‌యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణలో లోపాలు తలెత్తరాదు



మాట్లాడుతున్న ఆర్జేడీ రాఘవరెడ్డి

పుట్టపర్తి: ఎలాంటి లోపాలు లేకుండా పదో తరగతి పరీక్షలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ రాయలసీమ ఆర్జేడీ రాఘవరెడ్డి సూచించారు. మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షల నిర్వహణపై బుక్కపట్నం డైట్‌లో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరీక్ష కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. డీఈఓ మీనాక్షి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ లాజర్, పాలసముద్రం హెచ్‌ఎం ఫణికుమార్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెట్ పరీక్షా కేంద్రం పరిశీలన..

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బీడుపల్లి వద్ద ఉన్న ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కేంద్రాన్ని రెండోరోజు బుధవారం ఆర్జేడీ రాఘవరెడ్డి తనిఖీ చేశారు. ఉదయం 99 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 86 మంది, మధ్యాహ్నం 100 మందికి గాను 88 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 25 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వెంట డీఈఓ మీనాక్షి, ఏడీ నాగరాజు, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి రమణారెడ్డి ఉన్నారు.

బడిలో చేరిన అనాథలు, డ్రాపౌట్ పిల్లలు



పిల్లలను బడిలోకి చేర్పిస్తున్న అధికారులు

ధర్మవరం అర్బన్: బడి మానేసిన పిల్లలు, భిక్షాటన చేస్తూ అనాథలుగా ఉన్న బాలలను గుర్తించి వారిని తిరిగి బడిలో చేర్పిస్తున్నట్లు జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్, అధికారులు మురళీధర్, నాగలక్ష్మి, సీడీపీఓ లక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి ఉష తెలిపారు. ధర్మవరంలోని లక్ష్మీ చెన్నకేశవపురం, మహాత్మాగాంధీకాలనీలో బుధవారం వారు పర్యటించి బడి మానేసిన వారిని, భిక్షాటన చేస్తున్న పిల్లలు, వలసలకు వెళుతూ పిల్లలను నిర్లక్ష్యానికి గురిచేస్తున్న వారి కుటుంబాల సభ్యులతో సచివాలయంలో సమావేశమై మాట్లాడారు. అనంతరం కాలనీలలో పర్యటించి అనాథలుగా రోడ్డుపై తిరుగుతున్న బాలికలను గుర్తించి అనంతపురంలోని బాలసదన్‌కు తరలించారు. కుటుంబ ఆర్థిక స్థితిగతులు సరిగాలేని చిన్నారులను తిరిగి పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ ఆనంద్, వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం

గుంతకల్లు రూరల్ : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం పాతకొత్తచెరువు గ్రామానికి చెందిన హరిజన సాలప్ప, కాంతమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. తమకున్న 4.5 ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో గతంలో వ్యవసాయానికి చేసిన అప్పులు దాదాపు రూ.10 లక్షలకు పైగా చేరుకున్నాయి. దీంతో పెద్ద కుమారుడు చెన్నకేశవులు (28) చదువుకు స్వస్తి చెప్పి జేసీబీ ఆపరేటర్‌గా పని చేస్తూ కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. ఈ క్రమంలో 28 సంవత్సరాలు వచ్చినా తనకు పెళ్లి కాకపోవడం, 23 సంవత్సరాలు వచ్చినా తన చెల్లెలికి పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో మనోవేదనకు లోనయ్యారు. దీనికి తోడు చేసిన అప్పులకు వడ్డీలు కూడా చెల్లించలేని స్థితిలో మనస్తాపం చెందిన చెన్నకేశవులు మంగళవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలించారు. చికిత్సకు స్పందించక బుధవారం సాయంత్రం చెన్నకేశవులు మృతి చెందాడు. ఘటనపై గుంతకల్లు రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న బొలెరో

తాడిమర్రి: ద్విచక్ర వాహనాన్ని బొలెరో ఢీకొంది. అంతటితో ఆగకుండా 15 అడుగుల దూరం వరకూ తోసుకెళ్లింది. ఘటనలో ద్విచక్ర వాహనదారులు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. వివరాలు... వైఎస్సార్ జిల్లా లింగాల మండలం పార్నపల్లికి చెందిన రైతు ప్రతాప్ బుధవారం బొలెరో వాహనంలో అరటి కాయల లోడు వేసుకుని కర్ణాటకలోని హుబ్లీకి బయలుదేరాడు. సాయంత్రం 5 గంటలకు తాడిమర్రిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న స్పీడ్ బ్రేకర్ల సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోయి ఎదురుగా వస్తున్న బత్తలపల్లికి చెందిన రవితేజ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. అదే వేగంతో దాదాపు 15 అడుగులకు పైగా దూరం ద్విచక్ర వాహనాన్ని బొలెరో వాహనం తోసుకెళ్లింది. బొలెరో ఢీకొనే సమయంలో ద్విచక్ర వాహనం పైనుంచి పక్కకు దూకేయడంతో స్వల్ప గాయాలతో రవితేజ బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణమైన బొలెరో డ్రైవర్ షాబాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మామిడి, చీనీలో యాజమాన్యం పాటించండి


- ఎంటమాలజీ శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి



మామిడిలో పిందె దశను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి, అధికారులు

కళ్యాణదుర్గం: మామిడి, చీనీ తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు తిరుపతికి చెందిన ఎంటమాలజీ (కీటకాల) శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డి సూచించారు. కళ్యాణదుర్గం మండలం గూబనపల్లిలో బుధవారం మామిడి, చీనీ తోటలను స్థానిక ఉద్యానవన శాఖ అధికారులు, రైతులతో కలసి ఆయన పరిశీలించారు. మామిడిలో పూత రాలకుండా 10 లీటర్ల నీటికి 2.5 మి.లీ. ప్లానోఫిక్స్ కలిపి పిచికారీ చేయాలన్నారు. మామిడి కాయ నిమ్మ సైజులో ఉన్నప్పుడే ఫ్రూట్ కవర్స్ తొడిగితే పండు ఈగ, కాయ తొలుచు పురుగు నివారించుకోవచ్చన్నారు. అనంతరం పలువురు రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం, కంబదూరు ఉద్యాన అధికారులు కృష్ణతేజ, గౌసియా పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన గంగులప్ప

బత్తలపల్లి: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు... బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గుడిసెలు ఏర్పాటు చేసుకుని ద్విచక్ర వాహనంలో గ్రామాల్లో తిరుగుతూ స్టీల్ సామగ్రి విక్రయించుకునే గంగులప్ప బుధవారం ఉదయం ధర్మవరం వైపు వెళ్లి తిరిగి బత్తలపల్లికి వస్తున్నాడు. వేల్పుమడుగు బస్టాప్ వద్దకు చేరుకోగానే ఎదురుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఆదెప్ప (పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది) ఢీకొన్నాడు. ఘటనలో రోడ్డుపై పడిన ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న బత్తలపల్లి ఏఎస్ఐ తిరుపాలు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను వెంటనే ఆటోలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వీరిలో గంగులప్ప పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ప్రశాంత ఎన్నికలకు చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి



సమీక్షకు హాజరైన పోలీస్ అధికారులు

పుట్టపర్తి టౌన్: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. పుట్టపర్తిలోని సాయిఆరామంలో నెలవారీ నేర సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలు, శిక్షలు, కోర్టు కేసుల పురోగతి, డయల్ -100, రక్షక్ వాహనాలు, దిశ, స్పందన పిటీషన్లు, ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా..

రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లు, చెడునడక కలవారిని గుర్తించి క్రమం తప్పకుండా కౌన్సిలింగ్ నిర్వహించాలని ఎస్పీ సూచించారు. వారి కదలికలపై నిఘా ఉంచి బైండోవర్ చేయాలన్నారు. సమస్యాత్మక గ్రామాలు గుర్తించి కార్డన్ సెర్చ్ చేపట్టాలన్నారు. దొంగతనాలు, చీటింగ్ కేసులను సత్వరమే ఛేదించాలన్నారు. ఇలాంటి కేసుల్లో నిర్లక్ష్యం వహిస్తే పోలీసు వ్యవస్థపై నమ్మకం పోతుందన్నారు. ప్రాపర్టీ నేరాల నియంత్రణపై దృష్టి పెట్టాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ పెంచాలన్నారు. లైసెన్స్ కలిగిన తుపాకీలు స్వాధీనం చేసుకోవాలన్నారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపండి..

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లా సరిహద్దుల నుంచి మద్యం అక్రమ తరలింపు, విక్రయాలు, నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అక్రమంగా బంగారు ఆభరణాలు, నగదు తరలించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్రికెట్ బెట్టింగులు, మట్కా, పేకాటలకు తావులేకుండా చేయాలన్నారు. కోర్టుల్లో కేసులు వీగిపోకుండా గట్టిగా విచారణ చేపట్టి దోషులకు శిక్ష పడేలా చేయాలన్నారు. పోలీసులపై ప్రజలకు నమ్మకం కలిగేలా కింది స్థాయిలో హోంగార్డులు, పోలీసులు, అధికారులు పారదర్శకంగా విధులు నిర్వర్తించాలన్నారు. స్నేహభావంతో పనిచేసి ప్రజల మన్నన పొందాలన్నారు. కొత్త వ్యక్తులు, లాడ్జీలు, హోటళ్లపై ప్రత్యేక నిఘా ఉండేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తులో పురోగతి ఉండాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, అన్ని సబ్ డివిజన్ల డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

వెండి, నగదు పట్టివేత

విడపనకల్లు: స్థానిక 42వ జాతీయ రహదారిపై ఆంధ్ర సరిహద్దున ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టులో బుధవారం రూ.98 వేల నగదు, మూడు కిలోల వెండి సామగ్రి పట్టుబడింది. ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన మేరకు... తమిళనాడులోని సేలం పట్టణానికి చెందిన శంకర్... కర్ణాటక నుంచి ఎలాంటి ఆధారాలు లేకుండా వెండి సామగ్రి, నగదును కారులో తరలిస్తూ పట్టుబడ్డాడు. స్వాధీనం చేసుకున్న వాటికి సరైన ఆధారాలు చూపకపోవడంతో వాటిని సీజ్ చేశారు. వాహన తనిఖీల్లో విడపనకల్లు ఎస్ఐ ఖాజాహుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

యాడికి: మండల కేంద్రానికి చెందిన నాగేశ్వరరెడ్డి నాటుసారా విక్రయిస్తుండగా బుధవారం పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 9 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు చేసినట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.